విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రణస్థలం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఇచ్చిన దుస్తులు, పుస్తకాలు.. బ్యాగ్‌లను అందుజేసే కార్యక్రమలో ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన విద్యార్థులకు దిశా నిర్దేశం చేసారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు సాధించడానికి ఇంటర్ మీడియట్ కీలకమని వివరించారు. విద్యార్థులు వేసుకున్న దుస్తులు దగ్గరనుండి క్లాస్ లో తరగతుల వరకు క్రమశిక్షణ పాటించాలని అన్నారు. ప్రభుత్వం తొలి సారిగా విద్యార్థులకు అందు జేస్తున్న పుస్తకాలు, యూని ఫామ్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్య క్రమంలో ప్రిన్సిపాల్ జె. విజయ లక్ష్మి, కూటమి నాయకులు దన్నాన సత్యన్నారాయణ, దన్నాన స్వామినాయుడు, సుంకరి ధనసంజయరావు, జనపల గోవిందరావు తదితరులు ఉన్నారు.

ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని గడపండి

జిల్లా ఎస్పీ కెవి.మహేశ్వరరెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : సుదీర్ఘకాలం జిల్లా పోలీస్ శాఖకు సేవలందించి ఈ దినం ఉద్యోగ విరమణ చెందుతున్న పోలీస్ అధికారులు రిటైర్మెంట్ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా శేష జీవితాన్ని గడపాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సుమారు 35-40 సం.రాలు పోలీసు ఉద్యోగం బాధ్యతలు చేపట్టి బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్న సబ్ ఇన్స్పెక్టర్‌లు ఏ.ఎస్.వి. వెంకటరావు,ఎ ం.కోటేశ్వరరావు, పి.శ్యామల రావు,కె రమేష్ బాబు, (సిసిఎస్ పోలీసు స్టేషన్లో పని చేస్తున్నారు) అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్.ఆనంద్ రావు(సరుబుజ్జిలి పీఎస్), టి.సూర్య నారాయణ క్లాస్-4 ఉద్యోగి, అను వారికి జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ ముఖ్య అధ్యక్షతన ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్మెంట్ అవుతున్న పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఘనంగా దుస్సాళువలతో సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం రిటైర్మెంట్ అవుతున్న పోలీసు అధికారులు, సిబ్బంది వారి అనుభవాలు, అభిప్రాయాలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘకాలం జిల్లా పోలీస్ శాఖకు సేవలు అందించడం చాలా గొప్ప విషయమని ఈ సందర్భంగా ఎస్పీ గారు గుర్తు చేశారు. పోలిసు ఉద్యోగం అనేది మానసిక ఒత్తిడితో కూడుకొని కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ విధి నిర్వహణలు నిర్వర్తించవలసి ఉంటుందని తెలిపారు. కావున రిటైర్మెంట్ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా ఆనందంగా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్ కాజల్, డీఎస్పీలు త్రినాధ్ రావు, ఎల్ శేషాద్రి,ఏ.ఓ సి.హెచ్ గోపినాథ్, సిఐలు ఎల్ సన్యాసి నాయుడు, సోమశేఖర్, ఉమా మహేశ్వర రావు, దేవుల్లు, ఇతర అధికారులు సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులుగా కృష్ణారావు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం నౌపడ పంచాయతీ, సీతానగరం స్వదేశీయ మత్స్యకార సహకార సంఘానికి బుధవారం జరిగిన ఎన్నికల్లో సంఘ అధ్యక్షులుగా వాడరేవు కృష్ణారావు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా బచ్చల చినబాబు, సొసైటీ సెక్రటరీ బచ్చల బ్రహ్మానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే సంఘ బోర్డు సభ్యులుగా లింగూడు కుమార స్వామి, బచ్చల పాండురాజు, బచ్చల ఆదినారాయణ, బచ్చల నాగరాజు, వాడరేవు సింహాచలం, బచ్చల అప్పారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నరసన్నపేట మత్స్యశాఖ ఎఫ్.డీ.వో సురేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అనంతరం అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చన్న నాయుడు సహకారంతో మత్స్యకారుల అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన మత్స్యకారులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వదిన, మరిది మృతి

విశాలాంధ్ర - మందస : రణస్థలం మండలం పైడి భీమవరం సమీపంలో ఫ్లై ఓవర్ పై మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో వదిన, మరిదిలు సవర. హర్యాని (25) సవర.జీవన్ కుమార్ (21)లు దుర్మరణం పాలయ్యారు. మృతులు మందస మండలం బొగా బంధ పంచాయతీ కుడుమసాయి గ్రామానికి చెందినవారు. వివరాలు ఇలా ఉన్నాయి. మందస మండలం కుడుమసాయి గ్రామానికి చెందిన సవర.వెంకటేష్ కుటుంబం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు లో ఓ హెరీటల్ లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వెంకటేష్ భార్య హర్యాని, తమ్ముడు జీవన్ కుమార్ లు సొంత గ్రామంలో వ్యవసాయ పనులు చేయించేందుకు తణుకు నుండి మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పైడి భీమవరం సమీపంలో బైక్ అదుపుతప్పి ప్రమాదవశాత్తు ఫ్లై ఓవర్ ను ఢీకొంది. ఈ సంఘటనలో హర్యాని అక్కడికక్కడే మృతి చెందగా జీవన్ కుమార్ ఫ్లై ఓవర్ మీద నుండి క్రింద పడి మృత్యువాత పడ్డాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ కు తరలించారు. రణస్థలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఈ సంఘటనతో మందస మండలం కుడుమసాయి. గ్రామంలో విషాదఛాయలు చోటు చేసుకున్నాయి.

రక్తహీనత పేషంట్‌కి రక్తం అందజేత

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో స్థానిక బీసీ కోలనీలో నివాసం వుంటున్న నేదూరు మాధవిలత అనే మహిళ తీవ్ర రక్త హీనత గురై టెక్కలి జిల్లా హాస్పిటల్‌లో జాయిన్ అవ్వగా వైద్యులు అన్ని పరీక్షలు జరిపి అత్యవసరంగా ఓ నెగిటివ్ బ్లడ్ ఎక్కించాలని కుటుంబ సభ్యులకు తెలియజేయగా ఆసరలేని మహిళకు రక్తదానం చేయమని టెక్కలి అభయం యువజన సేవా సంఘంని సంప్రదించగా వెంటనే స్పందించిన అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి లో వున్న బ్లడ్ బ్యాంకు వారితో మాట్లాడి ఒక యూనిట్ ఓ నెగెటివ్ బ్లడ్ డాక్టర్ బి సునీత చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు15 సందర్భంగా ఆగస్టు 14,15,16 తేదీల్లో రక్తదాన శిబిరాన్ని టెక్కలి జిల్లా హాస్పిటల్ లో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్న రక్తదాతలకు ఎప్పుడు బ్లడ్ అవసరమైన మా అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, పలాస ప్రాణదాత బ్లడ్ బ్యాంక్, నరసన్నపేట మోక్ష బ్లడ్ బ్యాంక్ ద్వార అందజేస్తున్నమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మంజుల, శ్రీనివాస్, శ్రీధర్, ధనలక్ష్మి, అభయం సేవా సంఘం సభ్యుడు జె.ఆదినారాయణ పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీలో పార్టీ నేతలంతా పాల్గొనాలి ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : ఆగస్టు నెలకు సంబంధించిన సామాజిక పింఛన్లు పంపిణీ ఆగస్టు 1 గురువారం ఉదయం ఆరు గంటలకే ప్రారంభ మవుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే గొండు శంకర్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెలలో మాదిరిగానే నియోజక వర్గంలో 1వ తేదీనే అత్యధిక పింఛన్లను పంపిణీ చేసి శతశాతం నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారులు, సచివాలయ సిబ్బంది, నియోజక వర్గంలోని రూరల్, గార మండలాల నాయ కులతో పాటు నగరంలోని అన్ని డివిజన్లకు చెందిన ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. వృద్ధులకు, వికలాంగులకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేయాల్సి ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించుకోవాలని చెప్పారు.

ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి దొర, తవితయ్య

విశాలాంధ్ర - రణస్థలం : ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా లావేరు మండలం ప్రజాశక్తి రిపోర్టర్ ఇనపకుర్తి పొతన్నదొర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రణస్థలం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా కేంద్రం నుండి యునియన్ జిల్లా నాయకులు కె.వేణుగోపాల్, ఎస్.వెంకటరమణ, ఎ.వెంకటరమణ, డి.ఆనందరావు పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో విలేకరులకు అక్రిడేషన్స్, బస్సు పాసులు ఇవ్వడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు యూట్యూబ్ ఛానల్స్‌లో పనిచేసే వారికి కూడా అక్రిడేషన్స్, బస్సు పాసులు ఇప్పించేందుకు కృషి చేస్తామని పిలుపు నిచ్చారు. అలాగే జిల్లాలో పనిచేస్తున్న విలేకరులకు పూర్తి స్థాయిలో ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇచ్చే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వం కలిగిన యూనియన్ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అని అన్నారు. ముఖ్యంగా గ్రామ స్థాయిలో విలేకరులందరూ ఐక్యమత్యంగా ఉండాలన్నారు. ఆనంతరం జరిగిన నూతన కార్య వర్గాన్ని సభ్యులు ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా - ఇనపకుర్తి పొతన్నదొర (ప్రజాశక్తి, లావేరు మండలం), కార్యదర్శిగా- యామల తవిటయ్య (వైటిటివి రణస్థలం) ఉపాధ్యక్షులుగా - పి.ఈశ్వరరావు (ప్రజాశక్తి, ఎచ్చెర్ల), ఎస్.వరప్రసాదరావు (ప్రజాశక్తి రణస్థలం), జాయింట్ సెక్రటరీలుగా - డి.చిన్నారావు, వి.రాజశేఖర్, ట్రెజరర్ గా- కె.చంద్రశేఖర్, సభ్యులుగా - పి.నీలయ్య, బి.కోటేశ్వరరావు, పి.బుజ్జి, ఐ.సంతోష్, పి.శ్రీనివాసరావు, బి.సాయిలను ఎకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు.

శత శాతం వరి ఊడ్పులు వ్యవసాయ పనులు పూర్తి

విశాలాంధ్ర - జలుమూరు : జలుమూరు, సారవకోట మండల పరిధి అన్ని గ్రామాల్లో శత శాతం వరి ఊడ్పులు ఇతర వ్యవసాయ పనులు శత శాతం పూర్త య్యాయని ఆ ప్రాంత రైతుల తెలిపారు. ప్రస్తుతానికి వర్షం మీరు ఇతర కాలువల ద్వారా వచ్చే నీరు వేలాది ఎకరాలకు నీరు అందుతుందని గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మెట్ట ప్రాంత భూముల్లో కూడా వ్యవసాయానికి అనుకూలంగా ఉంది. బుధవారం ఎండ వేడిమికి ఆ ప్రాంతం భూములకు మళ్లీ నీటి ఎద్దడి ఉంటుందేమోనని రైతులు వాపోతున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆమదాలవలస : మండలంలో గాజుల కొల్లివలస 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ లో మునగ వలస, గాజుల కొల్లి వలస ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మ ధ్యాహ్నం 2 గంటల వరకు విద్యు త్ సరఫరాకు అంతరాయం కలు గుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎస్ బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో చెట్లు కొమ్మలు తొల గించుట, విద్యుత్ లైన్స్ మర మ్మత్తులు కారణంగా ఈ అంత రాయం కలుగుతుందన్నారు. దీని వలన మండలంలో ఉన్న గాజులకొల్లివలస, చిన్న జొన్న వలస, పెద్ద జొన్నవలస, మునగ వలస, రాధాకృష్ణ పురం, రామ చంద్రా పురం, పొన్నంపేట, చిట్టి వలస, సైలాడ, కుమ్మరి పేట, చవ్వాకులపేట, అక్కులపేట, తాళ్లవలస, మండాది తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహక రించా లని కోరారు.

రిమ్స్ నర్సింగ్ ఆఫీస్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిదే పెత్తనం

నర్సింగ్ స్టాఫ్ రోస్టర్ వేసేది అతగాడే - అతగాడికి వంత పాడుతున్న ఇన్చార్జిలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : రిమ్స్ ఆసుపత్రిలో నర్సింగ్ స్టాఫ్ కు డ్యూటీలు వేసే రోస్టర్ ను ఒక కాంట్రాక్ట్ మేల్ స్టాఫ్ నర్స్ వేస్తున్నారంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత నాలుగేళ్లుగా తనకు నచ్చినట్లుగా ఉద్యోగం చేస్తూ, రెగ్యులర్ నర్సింగ్ స్టాఫ్ రోస్టర్ లో ఇతగాడి పెత్తనం ఉందంటే అతగాడి మీద డ్యూటీలు వేయాల్సిన ఇంచార్జ్ లకు అంత నమ్మకం ఏమిటో వారికే తెలియాలి. అతగాడిపై ఆఫీసు బాధ్యతలను వదిలేసారంటే ఇతగాడు వారికి ఎలాంటి సేవలు చేస్తున్నాడో మరి. తను చెప్పేది వినేవారికి ఒకలా మాట వినని వారికి కష్టమైన డ్యూటీలు వేస్తూ సిబ్బందిని వేధిస్తున్నాడని విమర్శలు వినపడుతున్నాయి. ఈ విషయం సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్న లాభం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతగాడు మాత్రం దర్జాగా నర్సింగ్ స్టాఫ్ కార్యాలయంలో ఖాళీగా ఉంటూ జీతం మాత్రం సమయానికి తీసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నాడని విమర్శలు వినబడుతున్నాయి. దానికి తోడుగా ట్రైనీ స్టాఫ్ అటెండెన్స్ తీసుకునేందుకు మరొకరిని తీసుకొని వీరిద్దరూ కలిపి రెగ్యులర్ నర్సింగ్ స్టాఫ్ పై కూడా జులుం చూపిస్తున్నారని విమర్శలు వినబడుతున్నాయి. వీరిపై ఎన్ని ఆరోపణలు వచ్చినా వీరిని డ్యూటీలు మార్చే సహవాసం మాత్రం రిమ్స్ అధికారులు చేయడం లేదంటే ఇతను ఏ పాటి వాడో , ఇన్చార్జిలకు ఏ పార్టీ సేవలందిస్తున్నాడో కానీ ఇతని చెప్పిందే అక్కడ జరుగుతుందని సిబ్బంది వాపోతున్నారు. ఇతగాడి పనితనం ఏ పాటిదో అర్థం కావాలంటే రోస్టర్ చార్టులు చూస్తే అర్థమవుతుందని సిబ్బంది అంటున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి సిబ్బంది అందరికీ సమన్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

మంత్రిని కలిసిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర - పలాస : సంతబొమ్మాలి మండలం నిమ్మాడ లో గల మంత్రి కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును బుధ వారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మర్యాదపూర్వకంగా కలిసి వెంకటేశ్వర స్వామి చిత్ర పటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా పలాస నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్ళారు. వంశధార నీరు పలాస శివారు భూములకు అందించేందుకు కృషి చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆమెతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, కొర్ల కన్నారావు, కుత్తుం లక్ష్మణ్ కుమార్, కొరికాన శంకర్, సాసుమాన చంద్రమౌళి, శశి భూషణ్, బి.నాగరాజు, సప్ప నవీన్, దేవుడయ్య, తలగాన నరసింహమూర్తి టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సహారా డిపాజిట్లు తక్షణమే చెల్లించాలి

పలాస సహారా కార్యాలయం వద్ద ఏజెంట్లు నిరసన

విశాలాంధ్ర - పలాస : సహారా బాధితులకు తక్షణమే డిపాజిట్లు చెల్లించాలని సంఘ అధ్యక్షులు బైపల్లి సత్యరాజు డిమాండ్ చేశారు. బుధవారం కాశీబుగ్గ సహారా కార్యాలయం వద్ద సహారా కస్టమర్స్ అండ్ ఫీల్డ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా సహారా ఖాతాదారుల డిపాజిట్లు నిలిపివేయడంతో అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. శ్రీకాకుళం రీజన్ పరిధిలో సుమారు రూ.500 కోట్ల రూపాయలు సహారా సంస్థ ఖాతాదారులకు ఇవ్వాల్సి ఉందన్నారు. సిఆర్‌సి ఎస్ పోర్టల్ స్వల్పతరం చేసి సహారా సంస్థ చేసిన మోసాలని సరిచేస్తూ మా దగ్గర ఉన్న బాండ్లను సరైనవి మీరు నమ్ముతూ ఆయా ఖాతాలను పరిశీలించాలన్నారు. అనంతరం సహారా బాధిత ఖాతాదారులు, ఏజెంట్ల ఇబ్బందులను గుర్తించి సొమ్ములను బ్యాంకు ఖాతాలో జమ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బోయిన సత్యనారాయణ, సూర్యారావు, కే.వరప్రసాదరావు, శ్రీనివాసరావు, శ్రీ బాబురావు, డిఎన్ మోహన్‌రావు, హేమచంద్ర, రూప్ సుందర్, చింతాడ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో ఫిట్నెస్ జిమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే మామిడి

విశాలాంధ్ర - కొత్తూరు : మండలకేంద్రం కొత్తూరులో ఫిట్నెస్ జిమ్‌ను పాతపట్నం ఎంఎల్ఏ మామిడి గోవిందరావు బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక శ్రమ తగ్గుతున్న నేటి ఉరుకులు, పరుగులు జీవన శైలిలో జిమ్ అవసరం ఉందని అన్నారు. చాలా వరకు రోగాలు శారీరక శ్రమ తగ్గడం వల్ల వచ్చేవే అని ఎంఎల్ఏ మామిడి గోవిందరావు అన్నారు. కాగా అంతక ముందు మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి బీజేపీ పాతపట్నం నాయకులు సిరిపురం తేజేశ్వరావులు వచ్చి జిమ్ నిర్వాహకులు కడగండి రవికుమార్ ను అభినందించారు.

టౌన్ షిప్‌ను ఆదరించండి : పలాస ఎమ్మెల్యే శిరీషా

విశాలాంధ్ర - పలాస : పలాస మండలం రామక్రిష్ణాపురం సమీపంలో నిర్మాణం జరుగుతున్న టౌన్ షిప్‌ను ప్రతి ఒక్కరు ఆదరించాలని పలాస ఎమ్మెల్యే శిరీషా అన్నారు. బుధవారం రామక్రిష్ణాపురంలో నిర్మాణ దశలో ఉన్న టౌన్‌షిప్‌ను అధికారులతో పాటు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస జాతీయ ప్రక్కనే 150 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం జరుగుతున్న టౌన్‌షిప్‌ను పలాస ముఖచిత్రాన్ని మార్చే విధంగా ఉందన్నారు. ఇంత వరకు ఎక్కడా 150 ఎకరాల్లో లే అవుట్లు వేయలేదని, ఆ ఘనత పలాసకే దక్కిందన్నారు. ఇందులో మొదటి విడతగా 50 ఎకరాల్లో లే అవుట్లు వేశారని, వీటిలో రిటైర్డ్ ఉద్యోగులకు 20శాతం రిజర్వేషన్‌తో పాటు మధ్య తరగతి కుటుంబీకులకు అన్ని సౌకర్యాలతో నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. జిల్లాలో ఆర్థిక పట్టణంగా పలాస రూపుదిద్దుకొని ఉందని, ఈ టౌన్‌షిప్ ద్వారా పెట్టుబడులతో పాటు పరిశ్రమలు వచ్చే అవకాశముందన్నారు. రెండు మూడేళ్లల్లో టౌన్ షిప్ నిర్మాణం పూర్తి కానుందన్నారు. ఇళ్ల స్థలాల కోసం మూడు విడతల్లో నగదులు చెల్లించే అవకాశం కల్పించారని, ఇప్పటికే 40మంది లే అవుట్ల కోసం బుక్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ టౌన్ షిప్ ద్వారా వచ్చే ప్రతి రూపాయి కూడా మున్సిపాలిటీ అభివృద్ధికే ఖర్చు చేసేందుకు ఎమ్మెల్యేగా తాను భరోసా ఇస్తున్నానన్నారు. అందువలన టౌన్‌షిప్‌లోని లే అవుట్ల స్థలాలను ప్రతి ఒక్కరు కొనుగోలు చేసుకొని సకల సౌకర్యాలతో గృహాలు నిర్మించుకోవాలని, దీనిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సుడా వైస్‌చైర్మన్ ఓబులేష్, ప్లానింగ్ అధికారి టి.జి.రామ్మోహన్, జిల్లా టౌన్ అండ్ కాంట్రీట్ ప్లానింగ్ అధికారి కిశోర్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఇ.ఇ సుగుణాకర్‌రావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ఇంట భారీగా చోరీ

విశాలాంధ్ర - టెక్కలి : వరుస దొంగతనాలు టెక్కలిలో కలకలం రేపుతున్నాయి. ఈ నెలలో వరుస దొంగతనాలు జరగడంతో టెక్కలి ప్రజలలో ఆందోళన మొదలైంది. టెక్కలి మండల కేంద్రంలో ఉన్న స్థానిక రోటరీ నగర్ 1 లో తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. బీసీ కాలనీ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న వేణుగోపాల్ అనే ఉపాధ్యాయుని ఇంటిలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు బుధవారం ఉదయం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు వేణుగోపాల్ ఫిర్యాదు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... మేము మా కుటుంబ సమేతంగా ఇంటికి తాళాలు వేసుకుని మేడపైన నిద్రించడానికి వెళ్లిపోయామని చెప్పారు. రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఇంటిలో ఉన్న బీరువా లాకర్లో దాచి ఉన్న 12 తులాల బంగారం, మూడున్నర లక్షలు నగదు, కేజీన్నర వెండి చోరీ చేసినట్లు తెలిపారు. రాత్రి మేడ పైన నిద్రిస్తున్న మాకు కొంత సమయం తర్వాత పెద్ద శబ్దం రావడంతో నేను కిందకు వెళ్లి చూస్తేసరికి ఒక దొంగ పరిగెడుతున్నాడు. ఆ దొంగని పట్టుకుందాం అనే లోపు నన్ను గట్టిగా విసిరుగొట్టి పారిపోయాడని వేణుగోపాల్ తెలిపారు. ఈ సంఘటనపై టెక్కలి పోలీస్ స్టేషన్లో బుధవారం ఉదయం ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు. అయితే రాత్రి వేళల్లో పోలీసులు నిఘా సరిగ్గా లేకపోవడం వలనే ఇలా వరుసగా దొంగతనాలు జరుగుతున్నట్లు స్థానికులు అనుకుంటున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసామని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సుందర శ్రీకాకుళం నిర్మాణమే ధ్యేయం

ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : సుందర శ్రీకాకుళం నిర్మాణంలో భాగంగానే నగరంలోని పలు డివిజన్లలో నూతన రోడ్లను నిర్మాణం చేపడుతున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని డగ్లస్ స్కూల్ దగ్గర, 30, 33, 44 డివిజన్లలో రోడ్డు నిర్మాణాలకు బుధవారం ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నగరవాసులు కనీస మౌళిక సదుపాయాలకు నోచుకోలేదని తెలిపారు. నగరంలోని అనేక రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏనాడూ అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. బటన్ నొక్కడం నాయకులు జేబులు నింపుకోవడం ఇదొక్కటే వారు చేసిన పాలన అని విమర్శించారు. ప్రజల కనీస అవసరాలను తీర్చలేని విధంగా వైసీపీ ప్రభుత్వం పాలన సాగించిందన్నారు. అయితే వైసీపీ పాలనకు భిన్నంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతోందని, గొప్ప విజన్ కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒకవైపు సంక్షేమ పథకాలు అందిస్తూనే దానికి సమాంతరంగా అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు. నగరంలో ప్రజలకు కనీస మౌళిక సదుపాయాలైన రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం మెరుగు తదితర అంశాలపై దృష్టి సారించామని శంకర్ తెలిపారు. ఇప్పటికీ సంబంధిత శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించామని తెలిపారు. నగరంలోని అన్ని డివిజన్లలో పూర్తిస్థాయి మౌళిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని తొలి విడతగా రోడ్ల నిర్మాణం చేస్తున్నట్టు వివరించారు. అశ్రీకాకుళం జిల్లా కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే నెం 1 కార్పొరేషన్‌గా తయారు చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు నగర ఇంచార్జ్ కమిషనర్ చల్లా ఓబులేషు, టీడీపీ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు, అధికారులు, అనధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

విశాలాంధ్ర - నందిగాం : గురుకులంలో గురుకుల విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలో కలకలం రేపింది. చదువుతున్న గురుకులంలోనే ఆ విద్యార్థిని చున్నీతో ఉరివేసుకొని బలవన్మరణం పొందింది. నందిగాం మండల కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని నిమ్మక అక్షిత(16) డార్మిటరీ బాత్రూమ్‌కు ఉన్న కిటికీ ఊసలకు చున్నీతో ఉరివేసుకొని వేలాడుతూ ఉండడాన్ని గుర్తించిన అక్కడ వారు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దమయంతికి సమాచారం అందించారు. నందిగాం పోలీసులకు, రెవెన్యూ అధికారులతో పాటు తల్లిదండ్రలకు సమాచారం అందించారు. ఈనెల 24న విద్యార్థిని రెండవ కౌన్సిలింగ్‌లో జ్వాయిన్ అయింది. 26న హోమ్ సిక్ సెలవులకు వెళ్లి తిరిగి 29న గురుకులానికి వచ్చింది. ఇంతలో ఏమైందో ఏమోగానీ ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు తల్లిదండ్రులతో పాటు తదితర విద్యార్థినులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఒత్తిడి కారణంగానే ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నారు. నందిగాం పోలీసులు ఆత్మహత్య ఘటనపై మృతురాలు తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పలువురు ప్రజా సంఘ నాయకులు అక్కడకు చేరుకొని మృతురాలు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సమగ్ర దర్యాప్తు చేసి, మృతురాలు కుటుంబానికి న్యాయం చేయాలి... డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి: విద్యార్థిని మృతిపై సమగ్ర దర్యాప్తు చేసి ఆత్మహత్య లేక ఇంకేవైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో సమగ్ర దర్యాప్తు చేసి న్యాయం చేయాలని డీహెచ్ పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోప డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఆయన మృతు రాలు కుటుంబ సభ్యులతో విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుపై ఒత్తిడి లేకుండా చూడాల్సిన బాధ్యత ఉపాద్యాయులపై ఉంటుందని ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. ఏది ఏమైనప్పటికీ గురుకులంలో విద్యార్థి ఆత్మహత్య బాధాకరమని దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని, వారి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

విద్యార్థి మృతిపై నివేదిక అందించాలి... గురుకులంలో ఇంటర్ మీడియట్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఉదంతంపై జిల్లా అధికారులు, గురుకులం జిల్లా కోఆర్డినేటర్‌లు వెంటనే నివేదిక అంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థిని మృతిపై అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేసి నివేదిక అందించాలని సూచించారు.

వేద పాఠశాలను ఏర్పాటు చేయండి : జంగం కులస్తుల మొర

విశాలాంధ్ర - జలుమూరు : రాష్ట్రంలో శ్రీశైలం మినహా మరి ఎక్కడ శైవ కులస్తులకు వేద పాఠశాల లేక అనేక ఇక్కట్లు పడుతున్నామని శ్రీకాకుళం విజయనగరం విశాఖకు చెందిన జంగం ముఖ్య సోదరులు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడుని బుధవారం శ్రీకాకుళంలో కలిసి వినతి పత్రం అందజేశారు. పై మూడు జిల్లాల్లో ఏదో ఒక చోట మంత్రులతో చర్చించి నిరుపేద కులానికి చెందిన శివార్చనే ప్రధాన వృత్తి జీవనాధారంగా శివారాధన చేసే మమ్మల్ని ఆదుకోవాలని ఈ వినతి పత్రంలో కోరారు. అధినేతల దృష్టికి తీసుకు వెళ్తా ని దాసు నాయుడు హామీ ఇచ్చారు.

ప్రమాదాల నివారణకు గంగాధరపేట వద్ద పోలీసుల హెచ్చరిక

విశాలాంధ్ర - జలుమూరు : జలుమూరు మండలం జోనంకి పంచాయతీ గంగాధరపేట వద్ద అనేక ప్రమాదాలు జరిగి ఎందరో మరణించారు ప్రతి ఏటా ప్రమాదాల్లో అంగవైకల్యంతో కొంతమంది బాధపడుతుండగా సుమారు ఇద్దరు ముగ్గురు ఇక్కడ మరణిస్తున్నారు. ఎట్టకేలకు పోలీసులు చర్యలతో ఈ ప్రాంతంలో రెండు వైపులా ప్రమాద హెచ్చరికలు సూచనలు ఏర్పాటు చేశారు. రోడ్డుకు 20 అడుగుల రెండువైపులా డ్రమ్ములను బార్కెట్స్‌ను రాత్రి వేళలో కనిపించే స్టిక్కర్లు ను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు పోలీసులు చర్యలు తీసుకున్నందుకు ప్రయాణికులు అభినందిస్తున్నారు.

తహశీల్దార్లకి పోస్టింగులు..ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : ఎన్నికల సమయంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకి బదిలీపై వెళ్లి ఇటీవల తిరిగి శ్రీకాకుళం జిల్లాకి విచ్చేసిన 39 మంది తహసీల్దార్ లకి పోస్టింగ్ లు ఇస్తూ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకి అనుగుణంగా తహసీల్దార్ లకు మండలాలను కేటాయించారు. అలాగే కలెక్టరేట్లోని వివిధ విభాగాలలో సూపరింటెండెంట్ లుగా నియమించారు. కలెక్టరేట్ సి-సెక్షన్ సూపరింటెండెంట్ గా బి.రాజేశ్వరరావు, పోలాకి తహసీల్దార్‌గా ఎం.సురేష్ కుమార్, కలెక్టరేట్ హెచ్- సెక్షన్ సూపరింటెండెంట్‌గా బి.ప్రకాష్‌రావు, కలెక్టరేట్ ఏఓగా జి.ఏ.సూర్యనారాయణ, డి- సెక్షన్ సూపరింటెండెంట్‌గా డి.రమామూర్తి, రణస్థలం తహసీల్దార్ గా ఎన్. ప్రసాదరావు, వజ్రపు కొత్తూరు మండలానికి సి.బాల, సారవకోటకి కె.విజయలక్ష్మి, టెక్కలి సబ్ కలెక్టర్ డిఏఓగా జి.ప్రభాకర రాజు, హిరమండలానికి బి.వెంకటరమణ, పొందూరుకి ఎన్.రమేష్‌కుమార్, ఇచ్చాపురంకి ఎన్.వెంకట రావులను నియమించారు. శ్రీకాకుళం ఆర్డిఓ ఆఫీసు డిఏఓగా కె.రామారావు, శ్రీకాకుళం మండలానికి ఎస్. గణపతిరావు, గార మండలానికి ఎస్. రామారావు, జలుమూరుకి జి. లక్ష్మీనారాయణ, ఎచ్చెర్లకి ఏ.సింహాచలం, గెయిల్ శ్రీకాకుళం స్పెషల్ తహసిల్దార్‌గా కె. శ్రీరాములు, పలాసకి బి. సత్యం, మెళియాపుట్టికి ఎన్ .హనుమంతురావు, నరసన్నపేటకి టి.సత్యన్నారాయణ, పాతపట్నంకి ఎస్. కిరణ్ కుమార్, కోవ్వాడ ఎస్ డిసి ఆఫీస్ స్పెషల్ తహసీల్దార్‌గా పి.వేణుగోపాల రావు, టెక్కలి ఎస్.దిలీప్ చక్రవర్తి, శ్రీకాకుళం ఆర్థిక కార్యాలయ కెఆర్‌ఆర్ సి తహసీల్దార్‌గా కె. ప్రవల్లిక ప్రియ, బూర్జకి జే. ఈశ్వ రమ్మలు నియమితులయ్యారు. ఎల్ .ఎన్. పేట మండలానికి వై.వి. పద్మావతి, కవిటికి బి.మురళీమో హన్ రావు, జి. సిగడాంకి ఎం. శ్రీకాంత్, కోటబొమ్మాళికి ఆర్. అప్పలరాజు, సరుబుజ్జిలికి ఎ.మధుసూదన, కలెక్టరేట్ ఈ- సెక్షన్ సూపరింటెండెంట్ గా పి. సరోజిని, కొత్తూరు బి. పాపారావు, సోంపేటకి బి.అప్పల స్వామి, కంచిలికి వై. జయలక్ష్మి, లావేరు వై. జోగారావు, మందసకి బిడివి. ప్రసాదరావు, పలాస ఆర్డీఓ ఆఫీసు డిఏఓగా ఎస్.హైమావతి, టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం కెఆర్ ఆర్ సి తహసిల్దార్ గా బి.ఎస్.ఎస్.సత్యన్నారాయణలను నియమించారు. తక్షణం వారంతా విధులలో చేరాలని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

జీడి పరిశ్రమలో చెలరేగిన మంటలు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో టెక్కలి, మెలియాపుట్టి మార్గంలో గల జీడి పరిశ్రమలో ఒక్కసారిగా పొగలతో కారుమబ్బులు మాదిరిగా పొగలు కమ్ముకున్నాయి. బుధవారం వేకువజామున టెక్కలి మెలియాపుట్టి రహదారిలో అలజడ రేగింది. వివరాలలోకి వెళితే... టెక్కలి మండల పరిధిలో ఉన్న టెక్కలి మెలియా పుట్టి - రహదారిలో ఓ జీడిపప్పు పారిశ్రమలో బుధవారం వేకువజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అయితే ఉదయం అటువైపుగా వెళుతున్న స్థానికులు పరిశ్రమ నుండి చెలరేగిన పొగలు రావడం గమనించారు. వెంటనే ఆ పరిశ్రమ యాజమాన్యానికి సమాచారం అందించారు. యాజమాన్యం చేరుకున్న వెంటనే తాళాలు తెరిచి చూసేసరికి అంతా పొగలతో నిండి ఆటం మిషన్ నుండి భారీ మంటలు చెలరేగుతున్నాయి. వెంటనే టెక్కలి లో గల స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అతి తీవ్ర స్థాయికి చేరుకోకుండా అదుపు చేశారు. అప్పటికే జీడిపప్పు బస్తాలు పూర్తిగా కాలిపోయి నాశనమయ్యాయని యాజమాన్యం తెలియజేశారు. జీడిపప్పు బస్తాలు, ఆటం మిషనరీ సుమారు 4 నుండి 6 లక్షల వరకు అగ్నికి ఆహుతి అయ్యిందని యాజమాన్యం తెలియజేస్తున్నారు. ఈ ప్రమాదం ఆటం మిషన్ వల్లనే జరిగి ఉంటుందని, అందులో ఉన్న విద్యుత్తు వైర్లు షార్ట్ సర్క్యూట్ జరగడం వలన ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా అంచనాలు నెలకొంటున్నాయి. అగ్నిమాపక సిబ్బంది చొరవతో మంటలను అదుపు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు దిశగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు.

హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సభ్యుల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోగల డి.గోనప పుట్టుగ పంచాయతీ పరిధిలో గల వడ్డీ జల్లు పుట్టుగ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన గణపతి మజ్జికీ గత కొంత కాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారు. ఉన్నతలో అప్పు చేసి వైద్యులు దగ్గరికి వెళ్లి మందులు వాడుతున్నారు. హాస్పటల్ కి వెళ్లడానికి డబ్బులు లేక దాతల కోసం ఎదురుచూస్తున్నారు.ఈ విషయం హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులకు తెలిసిన వెంటనే హాస్పిటల్‌కి వెళ్లి అక్కడ సమస్య మొత్తం కనుక్కొని 6 వేల రూపాయలను ఆర్థిక సహాయంను గణపతి మజ్జి కి అందజేశారు. మరింత స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి గణపతి మజ్జికి సహాయం చేయాలని హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు పవన్,రజిని,ప్రవీణ్,లక్కీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందిస్తాం : ఎమ్మెల్యే కూన రవికుమార్

విశాలాంధ్ర - ఆమదాలవలస : విద్యా విధానం మెరుగు పరచడం లో భాగంగా నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నా రు. బుధవారం తొగరాం జూని యర్ కళాశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను సమూలంగా నాశనం చేసిందని తిరిగి దానిని పునరుద్ధరించేందు కు ప్రభుత్వం అంకితమై పని చే స్తుంది అన్నారు. యాప్ ల పేరు తో విద్యార్థులకు చదువు నుంచి దూరం చేశారని విమర్శించారు. జాతీయ విద్య విధానం పేరిట విద్యకు ఉపాధ్యాయుల దూరం చేశారని అన్నారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుంద న్నారు. విద్యార్థులు మంచి పేరు ప్రఖ్యాతలుగా ఉంచి పాఠశాలకు తల్లిదండ్రులకు సమాజంలో మంచి గుర్తింపుని తెచ్చేందుకు కృషి చేయాలి అన్నారు. విద్య శాఖ మంత్రి నారా లోకేష్ విద్య విధానం పై ప్రక్షాళన చేసి నాణ్య మైన విద్య అందించేందుకు చర్య లు చేపడుతున్నట్లు వివరించారు. ముందుగా గ్రామ దేవత పాటమ్మ తల్లికి పూజలు చేసారు. విద్యార్థు లకు పాఠ్యాంశా లపై ఉన్న శక్తిని పరీక్షించారు. తన విద్యను ఎప్ప టికప్పుడు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విశ్లేషించి వివరించాలని అధ్యాపకులను కోరారు. ఈ కా ర్యక్రమంలో అధ్యాపకులు తెలుగుదేశం నాయకులు తమ్మినేని చంద్రశేఖర్ ఇతరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - పోలాకి : విద్య వ్యాప్తి చెందాలని అందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నట్లు నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం పోలాకి ప్రియాగ్రహారం కళాశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించిన మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మండలంలో గల ప్రియాగ్రహారం పోలాకి కళాశాలలో సమస్యలుపై దృష్టి పెట్టి పరిష్కరించే చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో పోలాకి కళాశాల ప్రిన్సిపాల్ కే.గోవిందరావు గరిమెళ్ళ సత్యనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నాగ కుమారి నియోజకవర్గ పరిశీలకు కె.వెంకటేశ్వరరావు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మిరియపల్లి వెంకటప్పలనాయుడు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఖైరి భాస్కరరావు తమ్మినేని భూషణరావు సూరపు నారాయణదాసు, రోణంకి కృష్ణంనాయుడు పోలాకి మాజీ సర్పంచ్ ప్రతినిధి లుకలాపు రాంబాబు కళాశాల,ఉపాధ్యాయులు,విద్యార్థులు మరియు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతాయుతమైన నీటి సౌకర్యానికి వర్శిటీ ప్రాధాన్యత

వీసీ ఆచార్య కె.ఆర్.రజని

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : విద్యార్థులకు, వర్శిటీ వర్గాలకు కలుషితంలేని నాణ్యతయుతమైన నీటి సరఫరాకు, సౌకర్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు డా.బిఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయం వీసీ ఆచార్య కె.ఆర్.రజని తెలిపారు. బుధ వారం వర్శిటీలోని మహేంద్ర తనయ విద్యార్థినిల హాస్టల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. హాస్టల్స్‌తో పాటు పరిపాలనా కార్యాలయాలు, తరగతుల గదులకు అనుకొని ఇటీవల పూర్తి స్థాయిలో మంచి నీటి సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టామని ఈ సందర్భంగా తెలియజేశారు. పాడుబడిన వాటర్ మిషన్లను మరమ్మత్తు చేపడుతూనే వర్శిటీలోని పలు చోట్ల మరిన్ని త్రాగునీటి సరఫరా యంత్రాలను ఏర్పాటు చేయడమైందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత వర్శిటీ వర్గాల అందరిపైనా ఉందని సూచించారు. కార్యక్రమంలో వర్శిటీ రెక్టార్ ఆచార్య బి. అడ్డయ్య, వర్శిటీ హాస్టల్స్ ఛీఫ్ వార్డెన్ డా. ఎన్. లోకేశ్వరి, అసిస్టెంట్ ఛీఫ్ వార్డెన్ డా. సిహెచ్.రాజశేఖరరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.ఉదయభాస్కర్, ఓఎస్ డి డా.యు.కావ్యజ్యోత్న, హాస్టల్స్ డిప్యూటీ వార్డెన్లు డా.బి.విణు, డా. ఎం.చినసుబ్బారావు తదితరులు ఈ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పదవీ కాలంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

పదవీ విరమణ పొందిన జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు ఆత్మీయ సత్కారం

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : విద్యాశాఖలో జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందిన వెంకటేశ్వరరావుకి సహచర ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. 41 సంవత్సరాలు విద్యాశాఖలో పని చేసి నేడు పదవీ విరమణ పొందుతున్న వెంకటేశ్వరరావు దంపతులకు అధికారులు, సిబ్బంది, యూనియన్ బేరర్స్, ప్రధానోపాధ్యాయులు బుధవారం గురజాడ కళాశాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సత్కారం నిర్వహించారు. 1985లో ఎపిపిఎస్సి సర్వీస్ కమిషన్ ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన వెంకటేశ్వరరావు లు బాధ్యతలు నిర్వహించారని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఇతర అధికారులు, సహోద్యోగులు వెంకటేశ్వరరావు సర్వీసులో చేసిన సేవలు గురించి గుర్తు చేసుకున్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవి విరమణ అనేది సహజమని వారి సర్వీసులో ఉండగా చేసిన సేవలు సహ ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. దుశ్శాలువలు, జ్ఞాపకాలను, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందుతున్న వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 1985వ సం.లో విద్యాశాఖలో విధుల్లో చేరడమైనదని. శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖధికారిగా పదోన్నతి పై రావడం జరిగిందని అనంతరం జిల్లాలో జిల్లా విద్యాశాఖధికారిగా విధులు నిర్వహించడం చాలా ఆనందాన్ని కలిగించిందన్నారు. మనం మంచి చేస్తే మనల్ని ఎప్పుడు గుర్తు పెట్టు కుంటారని తెలిపారు. అలాగే నేను చేసిన సర్వీస్ లో నా పై అధికారులు, సహోద్యోగులు నావిధుల నిర్వహణకు అన్నివిధాల సహాయ సహకారాలు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు, కుటుంబ సభ్యులు, సంఘాల నాయకులు, విజయనగరం జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మోడల్ స్కూల్స్ టీచర్స్‌పై విచారణ

విశాలాంధ్ర - పొందూరు : జి.సిగడాం, పొందూరు మోడల్స్కూల్స్లో పనిచేస్తున్న ఇద్దరు టీచర్లు ప్రవేటు పాఠశాలల్లో పనిచేస్తున్నారంటూ కలెక్టర్కు వచ్చిన ఫిర్యాదు మేరకు డిప్యూటీ డీఈవో విజయకుమారి విచారణ జరిపారు. పొందూరు మోడల్స్కూల్లో పని చేస్తున్న ఫిజిక్స్ టీచర్, జి.సిగడాం మోడల్స్కూల్లో పనిచేస్తున్న మాథ్స్ టీచర్లు మెడికల్ లీవ్ పెట్టి రాజాంలో ఓ ప్రవేటు పాఠశాలలో పెట్టుబడి పెట్టి అక్కడ పని చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లుగా తెలిసింది. దీనిపై ఆయా ఉపాధ్యాయులను డిప్యూటీ డీఈవో ప్రశ్నించారు. అంతేకాకుండా మోడల్స్కూల్ విద్యార్థులు ద్వారా కూడా మీకు తెలిసిన వారిని మా పాఠశాలలో బాగా చెబుతారు. విద్యార్థులును చేర్పించాలని చెప్పాలని వారిచేత ప్రచారం చేసినట్లు తెలిసింది. ఈ విధంగా సెలవులు పెట్టి ప్రవేటు పాఠశాలలో బోధన చేయడం వలన మోడల్స్కూల్ విద్యార్థుల పరిస్థితి ఏంటని ఆయా ఉపాధ్యాయులను విచారణలో ప్రశ్నించినట్లు సమాచారం. మోడల్స్కూల్లో పనిచేస్తూ ఇలా ప్రవేటు పాఠశాలలో పనిచేయరాదని ఆయా ఉపాధ్యాయులను ఆమె హెచ్చరించారు. ఈ విచారణలో మోడల్స్కూల్స్ ప్రిన్సిపాల్స్ హెచ్.ప్రభాకర్, అన్నా శామ్యూల్స్, తదితరులు పాల్గొన్నారు.

హరిప్రసాద్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట మండలంలో సుదీర్ఘ కాలం వీఆర్వోగా పని చేసిన జి.హరి ప్రసాద్‌ను పదవీ విరమణ సందర్భంగా బుధ వారం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ గిరిబాబు, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. హరి ప్రసాద్ రిటైర్మెంట్ జీవితం ఆయు రారోగ్యాలతో ప్రశాంతంగా గడవాలని ఆకాంక్షించారు. విఆర్వోల అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఢిల్లీరావు, వీర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నాటుసారాతో అనారోగ్యం కొని తెచ్చుకోవద్దు

విశాలాంధ్ర - సోంపేట : నాటుసారా వాడకం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు తప్పవని అటువంటి సమస్యలు మందు బాబులు కొని తెచ్చుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఐ.ఏ.బేగం పేర్కొన్నారు. కంచిలి మండలం కత్తివరం గ్రామంలో బుధవారం గ్రామస్తులు సోంపేట ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బేగం మాట్లాడుతూ నాటుసారా వాడకం వల్ల కలిగే అనర్ధాలను వివరించారు. ఆరోగ్యానికి హాని కలగడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని వివరించారు. నాటుసారా ప్రమాదకరమైన మత్తు పదార్థమని దీని వలన శరీరంలో ప్రతి అవయవం దెబ్బ తిని ప్రాణహాని కలిగే ప్రమాదం ఉందని అన్నారు. నాటుసారా అమ్మకాలు జరిపినా, రవాణా చేపట్టినా వారి సమాచారం ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కత్తివరం గ్రామ సర్పంచ్‌తో పాటు సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహశీల్దార్

విశాలాంధ్ర - రణస్థలం : తహసీల్దార్ గా భాద్యతలు తీసుకుని ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు ని మర్యాదపూర్వకంగా కలిసిన తహసీల్దార్ ఎన్. ప్రసాదరావు, అధికారులు, నాయకులు జగన్నాధం నాయుడు, ప్రభాకర్,సురేష్, అశోక్, హరి, పోలీసు, ధనుంజయ, శ్రీను ఉన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు మహిళలకు గౌరవ స్థానాలు ఇవ్వడం జరిగిందని, దాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉందని, మహిళల రక్షణకు ఏర్పాటవుతున్న వివిధ రకాల చట్టాల పట్ల తగిన అవగాహన కల్గి ఉండాలని, పని ప్రదేశాల్లో కల్గే ఇబ్బందులపై ధైర్యంగా పోరాడాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ఐ.సి.డి.ఎస్ ఆధ్వర్యంలో పి.ఓ నాగరాణి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ శాఖల మహిళా సిబ్బందికి పని ప్రదేశాల్లో హింస నుండి రక్షణ, కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.ఇమ్మాన్యుయల్ రాజు, మండల న్యాయసేవా సంఘం ప్యానెల్ అడ్వకేట్ నాగరాజ్ పాత్రో, ఎం.ఈ.ఓ కె. అప్పారావులు మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్, ఎమ్పీడిఓ రాజేంద్రప్రసాద్, ఈదుపురం పి.హెచ్.పి వైద్యురాలు రమ్య లతో కలిసి పాల్గొని మాట్లాడుతు పలు అంశాలపై మహిళా ఉద్యోగినులకు అవగాహన కల్పించారు. చాలా మంది మహిళలు ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారని, ఇళ్ళలో పిల్లల ప్రవర్తన తీరు పట్ల తల్లిదండ్రుల నిశిత పరిశీలన ఉండాలని, స్త్రీలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రతీ ఒక్కరు ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ల వినియోగాన్ని అలవర్చుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఎం.ఈ.ఓ మాట్లడుతు పని ప్రతీ మహిళను సమాజం గౌరవించితీరాలని, అదే రీతిలో మహిళలు గౌరవాన్ని ఇనుమడింపజేసుకునేలా వ్యవహరించాలని విజ్ఞప్తి చేసారు. ప్యానెల్ అడ్వకేట్ మాట్లాడుతు సమాజంలో పెరుగుతున్న నేరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త క్రిమినల్ చట్టాల ద్వారా మహిళలు, చిన్నారుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇచ్చి కఠిన శిక్షలకు సిఫార్సులు జరిగాయని వివరించారు. తమకు ఎదురయ్యే ఇబ్బందులను తోటి వారితో, కుటుంభ సభ్యులతో తెలపడమే కాక పని ప్రదేశాల్లో అసభ్యకరంగా ఎవ్వరు ప్రవర్తించిన, తమ గౌరవానికి ఏ విధంగా భంగం కల్గించేలా ప్రవర్తించిన తగిన ఆధారాలతో అంతర్గత పరిరక్షణ కమిటీకి ధైర్యంగా ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సిబ్బంది, పలువురు మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు. 21వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ కాళ్ళ వెంకట లక్ష్మి, దాసరి శేఖర్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు కాళ్ళ జైదేవ్ తదితరులు పాల్గొన్నారు.

చెఱువుల లీజుపై రాద్ధాంతం..కోర్టు ఉత్తర్వుల భేఖాతరు

వైసీపీ అనుకూల వర్గం వైపు మొగ్గు

స్వదేశీ మత్స్యకార సంఘం తరపున టీడీపీ పోరాటం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని చేపల చెఱువుల లీజు అంశం ఎటూ తేల కుండా మూడే ళ్ళుగా నలుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో చేపల వేట, అమ్మకాలపై పూర్తిగా ఆధారపడి జీవనాధారం సాగిస్తున్న స్వదేశీ మత్స్యకార సంఘం సభ్యులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి అనుకూలమైన తీర్పు పొందారు. ఆదే అంశం పై బుధవారం నాటి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో రాద్ధాంతం చోటు చేసుకుంది. మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్ సమన్వయంతో ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో చేపల చెఱువు లీజు అంశం పై వైస్ ఛైయిర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి తిరస్కరణ నోటీసు అందజేసారు. చేపల చెఱువుల లీజు అంశంలో హైకోర్టు తీర్పును వక్రీకరించి లాలూచీ పడిన స్టాండింగ్ కౌన్సిల్, మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. 4,5 వార్డు కౌన్సిలర్లు గేదెల శేఖర్, నారాయణ బెహరాలు చేపల చెఱువుల లీజు అంశాన్ని ప్రస్తావిస్తూ తర తరాలుగా స్థానిక కంద్ర కులస్థులే చేపల చెఱువులను సొసైటీగా ఏర్పడి లీజుకు తీసుకుని జీవనోపాధి పొందుతున్నారని, హైకోర్టు కూడా వారికి అనుకూలంగా 33.34% పెంపుతో లీజు మంజూరుకు చర్యలు చేపట్టేలా తీర్పునిచ్చిందని అన్నారు. అయినా పట్టుబట్టిన వై.సి.పి వైస్ ఛైయిర్‌పర్సన్లు, కౌన్సిలర్లు చేపల చెఱువులకు బహిరంగ వేల నిర్వహించాలని డిమాండ్ చేయగా, మరో కౌన్సిలర్ మెజార్టీ సభ్యుల నిర్ణయంతో చర్యలు తీసుకోవాలని కోరడంతో 4,5వార్డుల కౌన్సిలర్లు సభను బహిష్కరించి వెలుపలికి వచ్చేసారు. వారికి అండగా నిలిచి తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు కాళ్ళ దిలీప్, ఆశి లీలారాని, పత్రి తవిటయ్య, కాళ్ళ వెంకటలక్ష్మిలు వాకౌట్ చేసారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిలర్లు మాట్లాడుతు ఇన్‌ల్యాండ్ ఫిషర్‌మేన్స్ సొసైటీని నిర్వీర్యం చేసి, ప్రైవేటు వ్యక్తులకు వై.సి.పి అనుకూలురకు మేలు చేసేలా కౌన్సిల్ సభ్యులు వ్యవహరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేసారు. బహిరంగ పోటీలో స్వదేశీ మత్స్యకార సంఘానికి తీవ్ర అన్యాయం తప్పదని, పెట్టు బడిదారులతో పోటీ సామాన్యం కాదని గ్రహించకుండా పేదల పొట్ట కొట్టి వారి జీవనోపాధిని నాశనం చేసి, లబ్ధిపొందాలనుకోవడం తగదని అన్నారు. పాత బస్టాండ్ కూడలి వద్ద ప్రజా మరుగుదొడ్ల నిర్వాహణకు హైదరాబాద్‌కు చెందిన శుభం స్వచ్ఛంద సేవా సంస్థ అభ్యర్థించిన అంశం పై కౌన్సిల్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసి, రోటరీకి అప్పగించాలని కోరడంతో సదరు అంశాన్ని కూడా వాయిదా వేసారు. అనంతరం నిర్వహించిన అత్యవసర సమావేశంలో 12.64 లక్షలతో కాలువల్లో పూడిక తీతకు. రూ॥1.50లక్షలతో పంప్ హౌస్‌లో కొత్తటా 10హెచ్.పి మోనోబ్లాక్, ఒక సబ్‌మెర్సిబుల్ పంప్ సెట్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు.

కవిటి తహశీల్దార్‌గా మురళీమోహన్

విశాలాంధ్ర - కవిటి : కవిటి నూతన తహసీల్దార్గా బి. మురళీ మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం సాయింత్రం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరిస్తానని, సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ ఎం.లక్ష్మీ అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు రెవెన్యూ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

మత్స్యకార సొసైటీ ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర - కవిటి : సాగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక కపాసుకుద్ది గ్రామంలో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా అధ్యక్షులుగా బడే డిల్లేసు, ఉపాధ్యక్షులుగా పుక్కల్ల రామ్మూర్తి, కార్యదర్శిగా దుమ్ము రాజయ్య, పాలకవర్గ సభ్యులుగా దశ త్రినాధ్,పండిపిల్లి కృష్ణారావు,పరిమిల్లి కామరాజు, బైపిల్లి బాబయ్య, దుమ్ము మోహనరావు, బడే లింగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎలక్షన్ ఆఫీసర్ కే గంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణారావు, గ్రామస్తులు బడే గురుమూర్తి, బడే రామారావు, దుమ్ము రుద్రయ్య, బడే లోహిదాసు, కాయి హరికృష్ణ,బడే మాధవరావు, తారకేశ్వర రావు పాల్గొన్నారు.

జీవో 85ను పునరాలోచించాలి

విశాలాంధ్ర - రణస్థలం : ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశం కొరకు తెచ్చిన ఇన్సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జీవో నెం. 85 గురించి ప్రభుత్వం పునరాలోచన చేయాలని ప్రభుత్వ వైద్యుల సంఘం బుధవారం ఎచ్చెర్ల నియోజకవర్గ పీహెచ్‌సీ వైద్యాధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఎన్. ఈశ్వర్ రావుకి వినతి పత్రం అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - రణస్థలం : లైన్ కు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలు తొలగించుటకు మరియు ఇతర మరమత్తులు చేయుటకు రణస్థలం 33/11కెవీ సబ్ స్టేషన్ పరిధిలో గల నగరపాలెం, బండిపాలెం, ముక్తుంపురం, పున్నాన పాలెం, సంచాం, బంటుపల్లి, కంబాలిపేట, తిరుపతిపాలెం తదితర గ్రామాలకు రేపు అనగా తేదీ 02-08-2024 న శుక్రవారం ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని ప్రజలు సహరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ డివిజన్ శ్రీకాకుళం వారు ఒక ప్రకటనలో కోరారు.

హెల్త్ కోర్సుల్లో ప్రవేశానికి

డా. బిఆర్‌ఏయూ దరఖాస్తులు అహ్వానం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : బొలినేని మెడ్ స్కిల్స్ (జెమ్స్- రాగోలు) తో సంయుక్తంగా నిర్వహిస్తున్న హెల్త్ సంబంధిత కోర్సులకు 2024-2025 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి డా. బి. ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం, దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మాస్టర్ ఆఫ్ హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేషన్(రెండు సంవత్సరాలు- 40 సీట్లు), పీజీ డిప్లొమో ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ (ఒక ఏడాది- 40 సీట్లు) కోసం దరఖాస్తులను ప్రస్తుతం స్వీకరిస్తున్నట్లు డా. బిఆర్‌ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. అనురాధ తెలిపారు. ఎంబిబిఎస్, బిడిఎస్, బిఎస్సీ(జనరల్), బిఫార్మసీ, బిఎస్సీ(నర్సింగ్), బిహెచ్‌ఎంఎస్ లేదా బిఎఎంఎస్, బిఎ, బికాం తదితర కోర్సులు పూర్తిచేసిన వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని తెలియజేశారు. 20 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, రూ.250లు ఆన్లైన్ పేమెంట్ చెల్లించి దరఖాస్తులను వెబ్సైటులు నుంచి పొందవచ్చునని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ దరఖాస్తులను ఆగష్టు 30వ తేదీ వరకూ ఎటువంటి అపరాధరుసం లేకుండా స్వీకరించనున్నట్లు తెలియజేశారు. వర్శిటీ, బొలినేని మెడ్ స్కిల్స్ సంబంధిత కార్యాలయాల్లో స్వయంగా వీటిని అందజేయవచ్చునని, పోస్టల్ ద్వారా కూడా స్వీకరించనున్నట్లు ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 79950 13422, 7680945357 ఫోన్ నెంబర్లుకు సంప్రదించాలని లేదా వర్శిటీ మరియు బొల్లినేని వెబ్సైట్లు చూడాలని ప్రిన్సిపాల్ డా. ఎం. అనురాధ తెలిపారు.

బారువ అభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట మండలం బారువ గ్రామం చారిత్రక నేపథ్యం కలిగియున్నప్పటికి అభివృద్ధికి ఇంకా ఆమడ దూరంలో ఉందని ఇప్పటికైనా బారువ మేజర్ పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధిపథంలో నడిపించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, జిల్లా ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ఆ గ్రామస్తులు ముక్తకంఠంతో కోరారు. ఈ మేరకు బారువ గ్రామం తరపున టీడీపీ యువనేత మద్దు కుమార్ గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని రామ్మోహన్ నాయుడుకు బుధవారం ఢిల్లీలో అందజేశారు. బారువ రైల్వేస్టేషన్‌లో పాసింజర్ రైళ్ల హాల్టు కోసం కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. బారువలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టాలని, సముద్రపు ఒడ్డున ఉన్న బారువను పర్యాటక అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. ఆయా అంశాలపై మంత్రి రామ్మోహన్‌నాయుడు వెంటనే ఆయా శాఖల అధికారులతో ఫోనులో మాట్లాడినట్లు మద్దు కుమార్ తెలిపారు.

కొత్తూరు తహశీల్దార్‌గా పాపారావు

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు మండల తహశీల్దార్‌గా బి.పాపారావును జిల్లా కలెక్టర్ నియమించారు. ఈయన అనకాపల్లి నుండి ఇక్కడికి బదిలిపై వచ్చారు కొత్తూరు తహ శీల్దార్‌గా ప్రస్తుతం పని చేసిన ఏం. వి.వేణు గోపాల రావు అనకాపల్లికి బదిలీ అయినారు 2024 సాధారణ ఎన్నికల ముందు ఎన్నికల నియమావళి మేరకు పక్క జిల్లాలకు ప్రభుత్వం బదిలీలు చేసింది ఇప్పుడు తాజాగా బదిలీలు జరిగాయి.